సమాచారం

రేపు సేవాలాల్ మహరాజ్ జయంతి

అడ్డగుట్ట: సేవాలాల్ లంబాడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించనునట్లు అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్ తెలిపారు. సోమవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. చంద్రశేఖర్‌నగర్‌లోని మేరమ్మయాడి సేవాలాల్ దేవాలయం వద్ద ఈ నెల 15న ఉదయం 11.30 గంటలకు బోగ్ బండారము అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

రేపు విమోచన ఉద్యమంపై అంతర్జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా వర్సిటీలో రేపు (15న) అంతర్జాతీయ సదస్సు జరగనుందని అధికారులు పేర్కొన్నారు. సంస్కృత, మరాఠీ, హిందీ, కన్నడ విభాగాలతో పాటు ఫ్రీడమ్ ఫైటర్ గంగారామ్ స్మారక మంచ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో 133 ఈ–క్లాస్ రూంలో హైదరాబాద్ విమోచన ఉద్యమంలో స్వాతంత్ర సమరయోధులు, భారతీయ భాషలు అనే అంశం పై సదస్సును నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్లు పేర్కొన్నారు. సదస్సుకు హెచ్‌సీయూ ప్రొ.సర్రాజు, ప్రొ.కేశవనారాయణ్ వేదాలంకార్, ప్రొ.మురళీకృష్ణ, ప్రతిభ గాంధీలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్ల వంకాయ 23, పాడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 33, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 48, పచ్చకాకర 37, పందిరిబీర 45, క్యాబేజీ 8, క్యారెట్ 18, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 45, కీర 21, దోసకాయ 19, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 19, చామగడ్డ 65, మొరంగడ్డ 18, కందగడ్డ 30, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

దరఖాస్తులకు ఆహ్వానం


ఉస్మానియా యూనివర్సిటీ: ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ) పీహెచ్‌డీ, పీడీఎఫ్ స్కాలర్స్‌కు జాతీయ ఫెలోషిప్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలు చేస్తున్న నెలకు రూ.30 వేల ఫెలోషిప్, మూడేళ్లకు రూ.30 వేల కాంటిజెన్సీ నిధి అందజేస్తారని అధికారులు పేర్కొన్నారు.

జపాన్ రాయబారితో ఓయూ బృందం



ఉస్మానియా యూనివర్సిటీ: జపాన్ పర్యటనలో ఉన్న ఓయూ బృందం సోమవారం రాయబార కార్యాలయాన్ని సందర్శించినట్లు అధికార వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జపాన్ రాయబారి సీబీ జార్జ్‌తో ఓయూ వీసీ ప్రొ.రవీందర్, స్టూడెంట్ డీన్ రాజేంద్రనాయక్, పూర్వవిద్యార్థి మురళీధర్ 6వ శతాబ్దం నుంచి ఇరుదేశాల మధ్యనున్న సంబంధాలను గుర్తు చేసుకున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

లాలాపేట: బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం తార్నాకలోని నర్సిమోంజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెనేజ్‌మెంట్ స్టడీస్ (ఎన్‌ఎంఐఎంఎస్)లో విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ రహదారి భద్రత నియమాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, ట్రిబుల్ రైడింగ్ వాటితో యువత ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారని విద్యార్థులుగా బాధ్యతగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు.

గృహిణి అదృశ్యం

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. అడ్డగుట్ట బీ–సెక్షన్‌కు చెందిన రూప(35), శంకర్ భార్యభర్తలు. కొన్ని రోజులుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 6న శంకర్ ఉద్యోగానికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చేసరికి రూప కనిపించలేదు. ఆందోళనకు గురైన శంకర్, తెలిసిన వారు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ సమస్యలను పరిష్కరించాలి

కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, చిత్రంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మల్లారెడ్డి

సనత్‌నగర్: నియోజకవర్గ పరిధిలో ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ సమస్యలను పరిష్కరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. బీఆర్‌కే భవన్‌లో సోమవారం ఇళ్ల స్థలాల సమస్యలపై మంత్రి కేటీఆర్ అధ్యక్షతన ఏడుగురు మంత్రులతో ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీలో సభ్యులైన మంత్రి తలసాని మాట్లాడారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నో సంవత్సరాల నుంచి ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుని అనేకమంది పేదలు నివసిస్తున్నారని, వారికి యాజమాన్యపు హక్కులు కల్పించాలని కోరుతూ వస్తున్నారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 70 సంవత్సరాల్లో ఏ ప్రభుత్వం కూడా పేద ప్రజల ఇళ్ల సమస్యల పరిష్కరించాలనే ఆలోచన కూడా చేయలేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల అవస్థలు తెలిసిన వ్యక్తిగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారానికి కృషి చొరవ చూపుతున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇందుకు సంబంధించి పలు సమస్యలు పరిష్కారమయ్యాయని మిగిలిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

70 కుటుంబాలు జీవనం..

నియోజకవర్గ పరిధిలోని జీరా కాంపౌండ్‌లోని నర్సింహాస్వామి, బాలాజీ దేవాలయాల పరిధిలో 70 కుటుంబాలు ఇళ్లను నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్నారని వీరికి ప్రభుత్వం రోడ్లు, విద్యుత్, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించిందన్నారు. స్థానిక ప్రజల కోరిక మేరకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించాలని ప్రతిపాదనలను పంపించడం జరిగిందని, స్థల బదలాయింపునకు కోర్టు ఉత్తర్వులు అడ్డంకిగా ఉన్నాయన్నారు. ఈ స్థలాన్ని దేవాదాయ శాఖ నుంచి కొనుగోలు చేసేందుకు జీహెచ్‌ఎంసీ సుముఖంగా ఉందని కలెక్టర్‌కు కూడా లేఖ పంపిన విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా కవాడీగూడలోని సోమప్ప మఠం స్థలంలో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నాయని, 1996లో 56 కుటుంబాలకు ధ్రువీకరణ పత్రాలను ఇవ్వడం జరిగిందని చెప్పారు. జీరా కాంపౌండ్‌లో 134 గృహాలు ఉన్నాయని, 1994 సంవత్సరంలో జీఓ 816 ప్రకారం రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆ సమయంలో సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండడంతో అప్పటి ప్రభుత్వం దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టిందన్నారు.

రేపు పర్యటన..

2002లో లబ్ధిదారులకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ జీఓ 816 గడువు ముగియడంతో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సనత్‌నగర్‌లోని శ్యామలకుంట, రాంగోపాల్‌పేటలోని వెంగళరావునగర్‌లో అనేక మంది పేదలు ఇళ్లను నిర్మించుకొని ఎన్నో సంవత్సరాల నుంచి నివసిస్తున్నారని తెలిపారు. రికార్డులలో ఎఫ్‌టీఎల్ కింద నమోదు చేయబడిందని, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరంగల్‌లో చేసిన విధంగా ఆయన్ కింద మార్పిడి చేసి అక్కడ నివసిస్తున్న ప్రజలకు పట్టాలు ఇవ్వడం ద్వారా వారికి ఎంతో మేలు చేసిన వారమవుతామన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఇబ్బందులు, వాస్తవ పరిస్థితులను తెలియజేసేందుకు ఈ నెల 15వ తేదీన రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, దేవాదాయ, ఇరిగేషన్ తదితర శాఖలకు చెందిన అధికారులతో కలిసి పర్యటించనున్నట్లు మంత్రి వివరించారు. వచ్చే సోమవారం జరిగే క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ముందు ఈ వివరాలను సమర్పించడం జరుగుతుందన్నారు.

పీహెచ్‌డీ నిబంధనలను సరి చూడాలి



ఓయూ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్వీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ పేరుతో తప్పుడు తడకల నిబంధనలను సరి చూడాలని సోమవారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు చటారి దశరథ్ నేతృత్వంలో విద్యార్థులు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు 2022 ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల చేశారని, మూడు నెలల తర్వాత వచ్చిన యూజీసీ కొత్త నిబంధనలు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. నోటిఫికేషన్ సమయంలో కొన్ని విభాగాలలో పీహెచ్‌డీ సీట్లు సూచించకుండా ప్రవేశ పరీక్షల తర్వాత ఖాళీలను ఎలా పెడుతారని ధ్వజమెత్తారు. ప్రతి విభాగంలో సీట్ల సంఖ్యను పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు (ఓబీసీ కాదు) తెలంగాణ రోస్టర్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఎంఫిల్ పూర్తి చేసిన అభ్యర్థులకు కేటగిరి–1లో ఇంటర్వ్యూలకు పిలవాలి. విభాగాల వారికి పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థుల సమాచారం విడుదల, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. పీహెచ్‌డీ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై కోర్టును ఆశ్రయించనున్నట్లు ఐక్య విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు.

కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించాలి

అడ్డగుట్ట: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని సంఘం అడ్డగుట్ట అధ్యక్షుడు గౌరి నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం అడ్డగుట్ట సీసీఐ కార్యాలయంలో భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని డివిజన్ పరిధిలోని ఏసీఎస్‌నగర్, తుకారాంగేట్, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో ఉండే సుమారు ఆరు వేల మంది భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి



సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

ప్రమాద భీమా, ఆరోగ్య భద్రత కార్డులతో పాటు గుర్తింపు కార్డులు, పెన్షన్ వంటివి సాధించే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీను, యాదగిరి, శంకర్, యాదగిరి, మల్లేశం, అంజయ్య పాల్గొన్నారు.

పోస్టుమార్టం అలవెన్స్ మంజూరు చేయాలి

ప్రొ. కృపాల్‌సింగ్



గాంధీఆస్పత్రి: ఆయా విభాగాల్లో సర్జరీ, సేవలు అందిస్తున్న వైద్యులకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించినట్లే ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యులకు పోస్టుమార్టం అలవెన్స్ మంజూరు చేయాలని తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు, గాంధీ ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కృపాల్‌సింగ్ డిమాండ్ చేశారు. కేరళ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం, కర్నాటక, హర్యాన, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో పోస్టుమార్టం అలవెన్స్ ఇస్తున్నారని గుర్తు చేశారు. మేజర్ టీచింగ్ ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియా, కాకతీయ,నిజామాబాద్, సిద్దిపేట, అదిలాబాద్ రిమ్స్‌ల్లో ప్రతిఏటా సుమారు 15 వేలకు పైగా పోస్టుమార్టంలు నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రౌండ్ ది క్లాక్ సేవలు అందించి, రాత్రి సమయంలో కూడా పోస్టుమార్టం నిర్వహిస్తున్నామన్నారు. పోస్టుమార్టం ఎగ్జామినేషన్ అలెవెన్స్, రిస్క్ అలవెన్స్ కింద వైద్యునికి రూ.1500, అసిస్టెంట్ మార్చురీ అటెండర్ రూ. 500, టేబుల్ బాయ్ రూ.200, క్లరికల్ స్టాఫ్ రూ.100, విస్రాను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్)కు తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్‌కు రూ. 200 చొప్పున ఒక పోస్టుమార్టంకు రూ.2500 కేటాయించాలన్నారు. గాంధీ ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ విభాగంలో కెడవర్ స్కిల్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలోనే సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, స్టేట్ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ వినోద్‌కుమార్, ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం అందించి పలు అంశాలపై చర్చించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు.

హైదరాబాద్ సభతో వివేకానందలో ఆత్మవిశ్వాసం

స్వామి బోధమయానంద



మాట్లాడుతున్న స్వామి బోధమయానంద

రాంగోపాల్‌పేట్: స్వామి వివేకానంద చికాగో పర్యటనకు వెళ్లే ముందు హైదరాబాద్‌లోని మహబూబ్ కళాశాలలో నిర్వహించిన బహిరంగ సభలో చేసిన ఉపన్యాసం ఆయనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద అన్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు స్వామి వివేకానంద తన శిష్యుల వద్ద తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని చెప్పారు. వివేకానంద డే సందర్భంగా సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 1893 ఫిబ్రవరి 10 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్ నగరంలో పర్యటించిన ఆయన ఈ చారిత్రక ప్రసంగాన్ని 13వ తేదీన మహబూబ్ కళాశాలలో మై మిషన్ టు ద వెస్ట్ అనే అంశంపై మొదటి ప్రసంగం చేశారని గుర్తు చేశారు. హైందవ ధర్మ ప్రాశస్త్యం, సంస్కృతి, వేద వేదాంత భావనలు, పురాణాలు బోధించే నైతిక ఆదర్శాలు ఇలా అనేక అంశాల గురించి తన వాగ్ధాటితో మంత్ర ముగ్ధులను చేశారన్నారు. ఇక్కడ జరిగిన సభ అనంతరం ఆయన ఉపన్యాసాల జైత్రయాత్ర విశ్వవేదికపై కొనసాగిందన్నారు. కులం, మతం, ప్రాంతం, భాష కోరల్లో చిక్కుకోవద్దని చెప్పిన వివేకానందుడి సూక్తులను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ల్యాంగ్వేజెస్ డైరెక్టర్ స్వామి శితికంఠానంద, రామకృష్ణ ప్రభ సంపాదకులు స్వామి పరిజ్ఞేయానంద, మహబూబ్ కళాశాల అధ్యక్షులు పీఎల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

25 నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



పికెట్ బస్తీవాసులతో శ్రీగణేశ్

కంటోన్మెంట్: దాదాపు రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన పికెట్ లక్ష్మీనగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠకు ఏర్పాట్లు సాగుతున్నాయి. స్థానిక నల్లపోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి మార్చి 1 వరకు విశిష్ట పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బొడ్రాయి ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ఏర్పాట్లు సాగుతాయని ఆయా కార్యక్రమాలకు స్థానిక ప్రజలు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యుల పిలుపు మేరకు స్పందించిన శ్రీగణేశ్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీగణేశ్ బొడ్రాయి మహోత్సవానికి సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. సోమవారం బస్తీని సందర్శించి ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు అశోక్ కుమార్, నర్సింగ్, సత్యనారాయణ, జ్ఞానేశ్వర్, సుధాకర్, సునీల్, శ్రీకాంత్, నాని పాల్గొన్నారు.

అన్నదానం



సనత్‌నగర్: మోడల్‌కాలనీ మానవ సేవా సమితి ఆధ్వర్యంలో ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో సోమవారం అన్నదానం చేశారు. మోడల్ కాలనీ అధ్యక్షుడు, సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు ఆర్థిక సహకారంతో ఆస్పత్రిలోని రోగులు, సహాయకులకు అన్నదానం చేశారు. మానవ సేవా సమితి తరుపున తరచూ ఇక్కడి రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహిస్తూ వారి ఆకలి తీరుస్తుంటారు. అందులో భాగంగా సోమవారం దాదాపు 300 మందికి అన్నదానం చేసినట్లు సభ్యులు పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ తులసి శరణ్య పేర్కొన్నారు. సీతాఫల్‌మండిలోని కుట్టి వెలోడి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఓయూ మెడల్ హైస్కూల్లో సోమవారం వైద్య పరీక్షలు చేపట్టారు. కంటి చూపు,ఎత్తు, బరువు,పెరుగుదల, దంతాలు, తదితరాలను పరిశీలించారు. దీర్ఘకాలిక రోగాలతో పాటు ఇతర జబ్బులు ఏమైన ఉంటే నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స చేయించనున్నట్లు డాక్టర్ శరణ్య పేర్కొన్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత వైద్య పరీక్షలు ప్రతి ఏటా మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం జ్యోతిశ్రీ వివరించారు.

హయ్యర్ వేజెస్ పెన్షన్ సాధనకు పోరాడుతాం

లాలాపేట: తమకు రావాల్సిన హైయ్యర్ వేజెస్ పెన్షన్‌ను సాధనకు అవసరమైతే సుప్రీం కోర్టుకెళ్లి న్యాయ పోరాటం చేస్తామని విజయ డెయిరీ రిటైర్డు ఉద్యోగులు పేర్కొన్నారు. సోమవారం లాలాపేటలోని విజయ డెయిరీ ఆవరణలో సమావేశమై మాట్లాడారు. విజయ డెయిరీలో గత 30 నుంచి 40 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో ఉద్యోగులు, కార్మికులకుగా సేవలందించామన్నారు. 2016లో ఆర్‌సీ గుప్తా కేసు ప్రకారం తమకు 2019 వరకు హైయ్యర్ వేజెస్ పెన్షన్ ఇచ్చారు. దీనిపై ప్రభుత్వం, ఈపీఎఫ్ రివ్యూ చేశాం. ఆర్‌సీ గుప్తా కేసు ప్రకారం తమ వద్ద ఫండ్ లేదని ఈపీఎఫ్ హయ్యర్ వేజెస్ పెన్షన్‌ను నిలిపివేసింది. ఆ తర్వాత నుంచి తమకు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పెన్షన్ డబ్బులు కూడా ఇవ్వడం లేదన్నారు.



మాట్లాడుతున్న విజయ డెయిరీ రిటైర్డు ఉద్యోగులు

ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు ఈపీఎఫ్‌కు ఫిర్యాదు, నోటీసులు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఎల్‌ఎన్ శాస్త్రి, పున్నారావు, నారాయణరెడ్డి, సత్యనారాయణ, నర్సింగరావు, పాండు, కిషోర్ కులకర్ణీ, కృష్ణయ్య, జితేందర్‌రెడ్డి, గోవిందరావు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపండి: మర్రి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: అవినీతిమయంగా మారిపోయిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ ఓల్డ్ బోయిగూడలో సోమవారం రాత్రి నిర్వహించిన ప్రజా గోస–బీజేపీ భరోసాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కనీస అవసరాలు తీర్చడంలోనూ విఫలమైందన్నారు. ఎన్నికలప్పుడు అబద్ధపు హామీలు గుప్పించడం, రాజకీయ లబ్ధి పొందడం తప్పా కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. మోసపూరిత వాగ్దానాలతో తొమ్మిదేళ్లు గడిచిపోయాయని ప్రస్తుతం ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ మాట్లాడుతూ.. స్వాతంత్రం తర్వాత ఎప్పుడు చేయనటువంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టారన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం చేసిన పోరాటంలో బీజేపీదే కీలక పాత్ర అన్నారు. రైతుల కోసం ఎప్పుడో మూతపడ్డ రామగుండం ఎరువుల కర్మాగారాన్ని రూ.6300 కోట్లతో పునఃప్రారంభం, ఎయిమ్స్ ఆస్పత్రితో పాటు రూ.8500 కోట్లతో నాలుగు వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, పార్లమెంటు కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఆకుల ప్రతాప్, నాయకులు పెద్ది రవీందర్, చీర శ్రీకాంత్, ఎస్‌ఆర్ మల్లేష్, ఆనంద్‌వ్యాస్, నరేష్ పాల్గొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం

- వ్యక్తికి జైలు



శ్రవణ్

రసూల్‌పురా: మద్యం మత్తులో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తి జైలు పాలైన ఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ వివరాల ప్రకారం.. పోలీసుల అనుమతి లేకుండా పెళ్లి బరాత్ తీస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుండటంతో పోలీసులు ఆపేందుకు వెళ్లారు. బరాత్‌లో తప్పతాగి ఉన్న ఉప్పల్‌కు చెందిన శ్రావణ్ (27) పోలీసులను అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించడంతో అతడిపై కేసు నమోదు చేసి 13వ ప్రత్యేక ఎంఎం కోర్టు న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. పది రోజుల జైలు, రూ. 650 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు



తప్పిపోయిన బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న లాలాగూడ పోలీసులు

అడ్డగుట్ట: తప్పిపోయిన ఓ బాలుడిని చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు లాలాగూడ పోలీసులు. ఇన్‌స్పెక్టర్ మధులత వివరాల ప్రకారం.. లాలాపేట శాంతినగర్‌లోని రామాలయం పరిసర ప్రాంతాల్లో ఆదివారం మధ్యరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు నాలుగేళ్ల బాలుడు అక్కడ తిరుగుతూ కనిపించాడు. వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా బాలుడు ఏమాత్రం మాట్లాడడం లేదు. దీంతో ఆ బాలుడిని వెంట పెట్టుకొని పరిసర ప్రాంతాల్లో తిరిగినా ఎవరూ గుర్తుపట్టకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో పోలీసులు శాంతినగర్ రామాలయం ప్రాంతాల్లో తిరిగి ఆచూకీ కనుగొన్నారు. బాలుడి తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తారని తెలుసుకుని వారికి అప్పగించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

లాలాపేట: అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా ఎంతో మంది మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూతనందిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనకట్ల హరి ఆధ్వర్యంలో మాణికేశ్వర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌ను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటికే 16 కేంద్రాలను ఏర్పాటు చేశామని వీటి ద్వారా బేసిక్ కంప్యూటర్, కుట్టు శిక్షణ, క్యాండీల్, జ్యూట్ బ్యాగుల తయారీ తదితర వృత్తి విద్యా కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందిస్తున్నామన్నారు. త్వరలో యువతకు కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, శ్యామ్‌సుందర్‌గౌడ్, కృష్ణమూర్తి, వీరన్న, సుక్క గణేష్‌రావు, శారదా, అనిత, గండి కోట నర్సింహ పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభించి దుస్తులు కుడుతున్న కావ్యరెడ్డి

మూర్ఛపై అపోహలను తొలగించాలి



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: మూర్ఛ వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను దూరం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం అంతర్జాతీయ మూర్ఛ దినోత్సం సందర్భంగా కిమ్స్ న్యూరాలజీ, ద ఎపిలెప్సీ అసోసియేషన్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మూర్ఛ ఉన్న పిల్లలను సామాజిక కార్యకలాపాలకు దూరంగా పెట్టడం, ఆటలు ఆడించకపోవడం వల్ల వారి అభివృద్ధి ఆత్మగౌరవం దెబ్బతింటాయన్నారు. మూర్ఛ అనేది కేవలం మెదడుకు వచ్చే సర్వసాధారణమైన వ్యాధి అని దేశంలో ప్రస్తుతం కోటి మందికి పైగా ఆ వ్యాధి బాధపడుతున్నారన్నారు. మెదడు ఎదుగుదలలో లోపాలు, జెనెటిక్స్, మెటబాలిజం, ఇన్‌ఫెక్షన్‌లాంటివి సోకడం, తలకు ప్రమాదాలతో దెబ్బలు తగలడం లాంటి రకరకాల కారణాలతో మూర్ఛ వ్యాధికి గురవుతున్నారన్నారు. అలాంటి వ్యాధి వాళ్లు సైతం సాధారణ ప్రజల్లాగే జీవితంలో ఏదైనా సాధించగలరని, వారికి సరైనా చికిత్స అందిస్తే పూర్తిగా సాధారణ జీవితం గడపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి మోహన్‌దాస్, న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి, న్యూరాలజిస్ట్ డాక్టర్ సీతా జయలక్ష్మి ఎపిలెప్సీ అసోసియేషన్ ఆఫ్ సికింద్రాబాద్ అధ్యక్షురాలు డాక్టర్ ఈఏ వరలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ అనూజ పాటిల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

రాంగోపాల్‌పేట్: ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని కార్పొరేటర్ కొంతం దీపిక పేర్కొన్నారు. సోమవారం ఆమె వెస్ట్ మారేడుపల్లిలోని అల్లాడి పెంటయ్యనగర్ బస్తీలో పర్యటించగా బస్తీ ప్రజలు పలు సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మోండా మార్కెట్ డివిజన్‌లో ఎటు చూసినా మురుగు, కలుషిత జలాల సమస్యలే దర్శనమిస్తున్నాయని తాను డివిజన్‌లోని ఏ బస్తీకి వెళ్లినా ప్రజలు ఈ సమస్యల గురించి ప్రస్తావిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యల దృష్టి పెట్టడం లేదన్నారు. ఎన్నో ఏళ్లక్రితం వేసిన పైప్ లైన్లు కావడంతో ఈ సమస్యలు తరచూ ఉత్పన్నమవుతున్నాయన్నారు.